
సాక్షి కామారెడ్డి

శుక్రవారం । 8 । నవంబర్ । 2024



రోడ్డు బాగా లేక..

నాగిరెడ్డిపేట మండలం లింగంపల్లికలాన్ రోడ్డు బాగాలేకపోవడంతో ధాన్యం బస్తాలను తీసుకెళ్లడానికి లారీలు రావడం లేదు.

- 9లో ▸



ప్రత్యేక తరగతులతో మేలు

ప్రత్యేక తరగతులతో విద్యార్థులకు మేలు కలుగుతుందని జిల్లా ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం అన్నారు.

- 9లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
36.0 /15.5

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

‘108’లో ఉద్యోగాలకు రేపు ఇంటర్వ్యూలు

కామారెడ్డి టౌన్: ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థ 108లో ఉద్యోగాల నియామకాల కోసం శనివారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లాల ప్రోగ్రాం మేనేజర్ గాధం మధుకుమార్, జిల్లా కో–ఆర్డినేటర్ తిరుపతి తెలిపారు. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్(ఈఎంటీ) ఉద్యోగాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. బీఎస్సీ లైఫ్ సైన్స్, బీ ఫార్మసీ, డీ ఫార్మసీ, జీఎన్ఎం, డీఎంఎల్‌టీ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు 22 ఏళ్ల నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలన్నారు. ఆసక్తి గల వారు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఒక సెట్ జిరాక్స్‌తో కామారెడ్డిలోని పాత తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు హాజరు కావాలని కోరారు. వివరాలకు 9100799153, 8074652252 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సర్వేను పరిశీలించిన సబ్ కలెక్టర్



బాన్సువాడ: ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సర్వేకు ప్రజలు సహకరించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి కోరారు. గురువారం పట్టణంలోని పాత బాన్సువాడలో ఇంటింటికీ సర్వే తీరును ఆమె పరిశీలించారు. తొలి దశలో హౌస్ లిస్టింగ్, మలి దశలో ప్రధాన సర్వే ఉంటుందన్నారు. ఆమె వెంట సిబ్బంది వెంకట్‌రెడ్డి, ఆంజనేయులు, మల్లికార్జున్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

బాధ్యతలు చేపట్టిన విద్యుత్ శాఖ ఎస్ఈ



కామారెడ్డి అర్బన్: విద్యుత్‌శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజినీర్ (ఎస్ఈ)గా శ్రావణ్‌కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్ఈగా పనిచేసిన రమేశ్ బాబు కరీంనగర్ బదిలీ కాగా శ్రావణ్‌కుమార్ మంచిర్యాల నుంచి వచ్చారు. ఆయనను విద్యుత్ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు సన్మానించారు. విశ్రాంత ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజన్న, జిల్లా కార్యదర్శి సాయాగౌడ్, జేఏసీ చైర్మన్ బ్రహ్మం, డివిజన్ అధ్యక్షుడు బి రఘు కుమార్, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

నిజాంసాగర్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం

- టూరిజం శాఖ ఎస్టేట్ అధికారి రామ్మోహన్



నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని టూరిజం శాఖ ఎస్టేట్ అధికారి రామ్మోహన్ పేర్కొన్నారు. అచ్చంపేట శివారులో గోల్ బంగ్లా వద్ద 121/2ఎ సర్వే నంబర్‌లో ఉన్న 12.3 ఎకరాల భూమిని గురువారం పర్యాటక శాఖకు అప్పగించారు. ఆ భూమిని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న పర్యాటక ప్రాంతం కళ త్వరలో నెరవేరబోతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ భిక్షపతి, నీటిపారుదల శాఖ ఎఈ శివప్రసాద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎలే మల్లికార్జున్, లక్ష్మయ్య, బంగ్ల ప్రవీణ్, రమేశ్ పాల్గొన్నారు.

10న మహాపథ సంచలన్

సుభాష్‌నగర్: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రారంభమై 100ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిజామాబాద్ నగరంలో 10వ తేదీన మహాపథ సంచలన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆర్ఎస్ఎస్ నగర కార్యవాహ అర్గుల సత్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు నగరంలోని ఖిల్లా రామాలయం, రాజీవ్ గాంధీ ఆడిటోరియం, శంకర్ భవన్ నుంచి వేర్వేరుగా పథ సంచలన్లు (ర్యాలీ) ప్రారంభమై శివాజీనగర్‌లోని శివాజీ చౌక్ వద్ద ఒకేచోట కలిసే సుందర దృశ్యాన్ని తిలకించేందుకు హిందువులందరినీ ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. సంచలన్ అనంతరం శివాజీనగర్ ఐటీఐ కళాశాల మైదానంలో సార్వజనికోత్సవాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ముఖ్యఅతిథిగా విశ్రాంత చీఫ్ ఇంజినీర్ హనుమంతరావు హాజరవుతారన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై ఫోకస్!

- సమస్యలు తలెత్తకుండా నిరంతర పర్యవేక్షణ
- కేంద్రాల వద్ద వ్యవసాయ విస్తీర్ణాధికారులకు డ్యూటీ
- కలెక్టర్, అదనపు కలెక్టర్ నిత్యం పర్యవేక్షణ
- సీనియర్ ఐఏఎస్‌కు ఉమ్మడి జిల్లా బాధ్యతలు

జిల్లా అధికార యంత్రాంగం ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టింది. రైతులకు ఇబ్బందులు కలుగకుండా, కొనుగోళ్లు సజావుగా సాగేలా అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. నిత్యం గ్రామాల్లో పర్యటిస్తూ క్షేత్రస్థాయి సిబ్బందికి, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచనలు చేస్తున్నారు. దీంతో జిల్లాలో ధాన్యం సేకరణ సజావుగా సాగుతోంది.



గర్గుల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి శరత్, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ధాన్యం కొనుగోళ్లపై జిల్లా యంత్రాంగం ఫోకస్ చేసింది. ఒక వైపు సర్వేలో బిజీ ఉన్నప్పటికీ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్, ఆర్డీవోలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షిస్తున్నారు. కేంద్రాల వద్ద సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కొనుగోళ్లు ఆలస్యంగా మొదలైనా వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్నారు. కాగా జిల్లాలో 423 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా, అందులో 67 కేంద్రాలు సన్నరకం ధాన్యం కొనుగోలుకు కేటాయించారు. జిల్లాలో గురువారం నాటికి 4,466 మంది రైతుల నుంచి 30,629 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. కాగా ధాన్యం కొనుగోలను పర్యవేక్షించేందుకు ఉమ్మడి జిల్లాకు సీనియర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ ఎ శరత్‌ను ప్రత్యేక అధికారిగా నియమించారు. కొనుగోళ్లతో పాటు ఇంటింటి సర్వేను ఆయన పర్యవేక్షిస్తున్నారు. ఇదే సమయంలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ కూడా జిల్లాలో పర్యటిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశిస్తున్నారు. గోనె సంచుల కొరత తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు పేర్కొంటున్నారు.

జిల్లాలో పర్యటించిన ప్రత్యేకాధికారి


ధాన్యం కొనుగోళ్లపై జిల్లా ప్రత్యేకాధికారిగా సీనియర్ ఐఏఎస్ శరత్ గురువారం జిల్లాలో పర్యటించారు. అధికారులతో సమీక్షించారు. కొనుగోలు కేంద్రాలకు వెళ్లి రైతులతో మాట్లాడారు. అలాగే పౌరసరఫరా శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ కూడా జిల్లాలో పర్యటించనున్నారు.

సమస్యలు తలెత్తకుండా..

జిల్లా అధికారులు నిత్యం ఏదో ఒక ప్రాంతంలో కొనుగోలు కేంద్రాలకు వెళ్లి పర్యవేక్షిస్తున్నారు. ఎక్కడ సమస్య తలెత్తవద్దంటూ కలెక్టర్ అధికారులకు సీరియస్‌గా హెచ్చరిస్తున్నారు. దీంతో అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తూ కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించడంతో పాటు గన్నీ బ్యాగులు, ఇతర సామగ్రి కొరత ఏర్పడకుండా చూడాలని ఆదేశించారు. దీంతో కొనుగోళ్లు సవ్యంగానే నడుస్తున్నాయి. ఐదు లక్షల పైచిలుకు మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేయగా, కొన్ని ప్రాంతాల్లో రైతులు వడ్లను ప్రైవేటు వ్యక్తులకు విక్రయించారు.

ఆగని తరుగు దోపిడీ

చాలా చోట్ల మిల్లర్లు తేమ, పొల్లు పేరుతో తరుగు తీస్తున్నారు. రైతులను ఇబ్బంది పెట్టొద్దని కలెక్టర్ హెచ్చరించినా తూకం విషయంలో అనేక రకాల సమస్యలు సృష్టిస్తున్నారు. 40 కిలోల బస్తాకు అదనంగా 2 కిలోల నుంచి రెండున్నర కిలోల వరకు తూకం వేస్తున్నారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. క్వింటాలుకు ఐదు కిలోల వరకు నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు ఈ విషయంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



అవసరం మేరకు టీచర్ల సర్దుబాటు!

- జిల్లాలోని వివిధ స్కూళ్లకు 78 మంది
- కలెక్టర్ ఆమోదంతో విద్యాశాఖ చర్యలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : విద్యార్థులు ఉన్న చోట టీచర్లు లేకపోవడం, టీచర్లు ఉన్న చోట విద్యార్థులు తక్కువగా ఉండడంతో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశాల మేరకు విద్యాశాఖ అధికారులు సర్దుబాట్లు చేశారు. జిల్లావ్యాప్తంగా 78 మంది టీచర్లను వివిధ పాఠశాలలకు పంపుతూ జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ రాజు ఉత్తర్వులు జారీ చేశారు. గత నెలలో డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు కలెక్టర్ అనుమతితో టీచర్లను సర్దుబాటు చేసినట్టు డీఈవో ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దాదాపు అందరిని ఆయా మండలాల పరిధిలోనే సర్దుబాటు చేశారు. ఒకరిద్దరినీ సమీపంలోని ఇతర మండలాల్లో అడ్జస్ట్ చేశారు. గతంలో ఇష్టారీతిన సర్దుబాట్లు చేయడం వివాదమైన విషయం తెలిసిందే. ముఖ్యంగా మండలమే కాదు నియోజకవర్గాలు దాటి కూడా సర్దుబాటు పేరుతో వసూళ్ల దందా నడిపించారు. జిల్లాలో జరిగిన అక్రమ డిప్యూటేషన్ల వ్యవహారంపై ‘సాక్షి’లో ప్రచురితమైన కథనాలతో కలెక్టర్ స్పందించి విచారణ జరిపించారు. అక్రమ డిప్యూటేషన్లన్నింటినీ రద్దు చేయాలని ఆదేశించారు. దీంతో 27 మంది డిప్యూటేషన్లు రద్దయిన విషయం తెలిసిందే. తాజాగా జరిపిన సర్దుబాట్లలో పెద్దగా పొరపాట్లకు తావులేకుండా జరిగినట్టు భావిస్తున్నారు.

పర్యవేక్షణతో సత్ఫలితాలు

జిల్లాలో విద్యా ప్రమాణాలు మెరుగు పడాలంటూ కలెక్టర్ సంగ్వాన్ ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. అయితే జిల్లా విద్యాశాఖ అధికారితో పాటు మండల విద్యాశాఖ అధికారులు ఎప్పటికప్పుడు స్కూళ్లకు వెళ్లి పర్యవేక్షణ చేయడం ద్వారా మరింత మార్పు వచ్చి ప్రమాణాలు మెరుగుపడతాయని భావిస్తున్నారు. ఇంతకుముందు ఒక్కో ఎంఈవోకు నాలుగైదు మండలాలు ఉండేవి. ఇటీవల ప్రభుత్వం కొత్త మండలాలకు కూడా ఎంఈవోలను కేటాయించిన నేపథ్యంలో పర్యవేక్షణ సులువైంది. ఎంఈవోలు స్కూళ్లను తనిఖీ చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించే అవకాశం ఉంటుంది.

దేశానికే రోల్‌మోడల్‌గా తెలంగాణ

- నిబంధనల మేరకు ధాన్యం తూకం వేయాలి
- రాష్ట్ర సివిల్ సప్లై కమిషనర్ దేవేంద్ర సింగ్ చౌహాన్



ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న సివిల్ సప్లై కమిషనర్ దేవేంద్ర సింగ్ చౌహాన్, కలెక్టర్ సంగ్వాన్

భిక్కనూరు: ధాన్యం ఉత్పత్తితో తెలంగాణ దేశానికే రోల్‌మోడల్‌గా ఉందని ఆ పేరును కాపాడుకోవల్సిన బాధ్యత అందరిపై ఉందని రాష్ట్ర సివిల్ సప్లై కమిషనర్ దేవేంద్ర సింగ్ చౌహాన్ అన్నారు. గురువారం రాత్రి ఆయన భిక్కనూరు మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ఉన్న బ్రాండ్ ఇమేజ్‌ను కాపాడుకోవాలన్నారు. నిబంధనల ప్రకారం తేమ శాతం 17కంటే తక్కువగా ఉన్నప్పుడే కాంటాలు చేయాలని సూచించారు. రైతులు తొందరపడి వరి కోతలు చేపట్టవద్దని ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఎలాంటి ఆందోళన చెందవద్దని పూర్తిగా ఎండిన తర్వాతనే కోతలు చేపట్టాలన్నారు. అలాగే వరి ధాన్యం ఎండబెట్టిన తర్వాతనే కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి కాంటాలు చేయించాలన్నారు. ప్రభుత్వం సన్నం రకం వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తుందని, రైతులు సన్నాల సాగు పెంచాలని సూచించారు. ఈ సీజన్‌లో కొనుగోలు కేంద్రాల్లో సన్న రకం ధాన్యం విక్రయించిన రైతులకు మొదట క్వింటాలకు రూ.2300 చెల్లించి తర్వాత బోనస్ ఖాతాల్లో జమ చేస్తామన్నారు. రాష్ట్రంలో పండించిన సన్న రకం బియ్యం తెల్లగా మెరుస్తాయని ఇది తెలంగాణకు ఎంతో పేరు తెస్తుందన్నారు. కాంటా వేసిన తర్వాత రెండు రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని చెప్పారు. రానున్న రోజుల్లో రేషన్ దుకాణాల ద్వారా ప్రభుత్వం సన్న బియ్యం సరఫరా చేస్తుందని తెలిపారు. తేమ శాతం ఎక్కువగా ఉంటే ధాన్యాం మరింత ఆరబెట్టిన తర్వాతే కాంటా చేయాలని ఆదేశించారు. అనంతరం అధికారులతో ధాన్యం కొనుగోళ్లపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీవో రంగనాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పాత రాజు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి నర్సింహరావు, డీఎం రాజేందర్, తహసీల్దార్ శివకుమార్, డీటీ కిష్టయ్య, ఎంపీడీవో రాజకిరణ్‌రెడ్డి, ఏడీఏ అపర్ణ, ఏవో రాధారెడ్డి, విండో చైర్మన్ గంగళ్ల భూమయ్య పాల్గొన్నారు.

సర్వేను సక్రమంగా చేపట్టాలి

- ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి శరత్



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి శరత్, పక్కన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వేను సమర్థవంతంగా చేపట్టాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ ఎ శరత్ అన్నారు. గురువారం ఆయన జిల్లాకు విచ్చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ.. ఇంటింటి సమగ్ర సర్వేను వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు పూర్తి స్థాయిలో సమాచారం సేకరించాలన్నారు. అన్ని కుటుంబాలకు సంబంధించిన సమగ్ర సమాచారం ఉంటేనే అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడానికి అవకాశం ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రతి బృందం రోజుకు కనీసం 15 గృహాలను సర్వే చేయాలన్నారు. సర్వే కోసం జిల్లాలో నియమించిన ఎన్యుమరేటర్‌లు, సూపర్‌వైజర్‌ల వివరాలను కలెక్టర్ సంగ్వాన్ ప్రత్యేకాధికారికి వివరించారు. సమష్టిగా పనిచేయాలని ప్రత్యేకాధికారి జిల్లా అధికారులకు సూచించారు.

గర్గుల్ గ్రామంలో పర్యటన

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మండలం గర్గుల్‌లో ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి శరత్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌తో కలిసి గురువారం పర్యటించారు. కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడారు. అనంతరం ఇంటింటి సర్వేలో భాగంగా హౌస్ లిస్టింగ్ తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్‌లు శ్రీనివాస్ రెడ్డి, వి విక్టర్, ఆర్డీవో రంగనాథ్ రావు, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం రాజేందర్, ఏఎస్‌వో నరసింహారావు, సహకార అధికారి రామ్మోహన్, డీఏవో తిరుమల ప్రసాద్, ఎస్సీ సంక్షేమ అధికారి రజిత, తహసీల్దార్ జనార్దన్, ఎంపీడీవో నాగవర్ధన్ ఎంపీవో హెప్సిబారాణి తదితరులు పాల్గొన్నారు.

అదనంగా కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

ఈ సారి ధాన్యం కొనుగోళ్ల కోసం అవసరమైన ప్రతి గ్రామంలో కేంద్రాలను ఏర్పాటు చేశామని ప్రత్యేకాధికారి శరత్ అన్నారు. రైతుల సంక్షేమం దృష్ట్యా అదనపు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సన్న రకం వడ్ల కోసం ప్రత్యేక కేంద్రాలు ప్రారంభించినట్లు వెల్లడించారు. ట్యాబ్ ఎంట్రీ సకాలంలో చేస్తేనే పురోగతి కనిపిస్తుందన్నారు. కేంద్రాల్లో రైతులకు అసౌకర్యం కలుగకుండా చూడాలని అన్నారు. జిల్లాలో 423 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, వాటిలో సన్న రకం వడ్ల కొనుగోళ్లకు 67 కేంద్రాలు కేటాయించామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ప్రత్యేకాధికారికి వివరించారు. గోనె సంచులు, రవాణా సదుపాయాలు, మిల్లర్ల బ్యాంక్ గ్యారంటీ, రైతులకు చెల్లింపులు, తదితర అంశాలపై వివరించారు.

రేషన్ దుకాణాల్లో నూకల బియ్యం

- రెండు నెలల క్రితం రిజెక్టు అయిన బియ్యాన్నే సరఫరా చేసిన అధికారులు
- ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు

ఎల్లారెడ్డి రూరల్: రేషన్ దుకాణాలకు నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలని ప్రభుత్వం ఆదేశించినా అధికారులు పట్టించుకోవడం లేదు. నూకల బియ్యం సరఫరా చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఎల్లారెడ్డి సివిల్ సప్లై గోదాం పరిధిలోని పలు రేషన్ దుకాణాలకు అధికారులు నూకల బియ్యం పంపించారు. ఎల్లారెడ్డి గోదాం పరిధిలో 79 రేషన్ దుకాణాలున్నాయి. వీటికి రెండు నెలల క్రితం పెద్దపల్లి జిల్లా నుంచి నూకలు, దుమ్ము ధూళి ఉన్న బియ్యం సరఫరా చేశారు. వినియోగదారుల నుంచి ఫిర్యాదులు అందడంతో అధికారులు రేషన్ దుకాణాలలో మిగిలిన బియ్యాన్ని గోదాంలకు తరలించి మంచి బియ్యాన్ని అందించాలని ఆదేశాలు జారీ చేశారు. గోదాంకు తరలించిన బియ్యాన్ని జిల్లా సివిల్ సప్లై ఆఫీసర్ పరిశీలించి దుమ్ము, ధూళితో పాటు నూక శాతం ఎక్కువగా ఉన్న బియ్యాన్ని తిరిగి పెద్దపల్లి జిల్లాకు పంపాలని సూచించారు. అయితే అధికారులు ఆ బియ్యాన్నే మళ్లీ రేషన్ దుకాణాలకు పంపించారు. దుకాణానికి 8 నుంచి 10 సంచుల చొప్పున నూకల బియ్యం సరఫరా చేశారు. దీంతో దుకాణాల్లో కొంత మందికి నూకల బియ్యం రావడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దుకాణదారులతో వాగ్వాదం చేయగా గోదాం నుంచి వచ్చిన బియ్యం ఇస్తున్నామని తమ వద్ద ఎలాంటి స్టాక్ లేదని వారు చెబుతున్నారు. అధికారులు స్పందించి మంచి బియ్యం అందించాలని ప్రజలు కోరుతున్నారు.



ఎల్లారెడ్డిలో రేషన్ దుకాణాలకు సరఫరా అయిన నూకల బియ్యం



నూకల బియ్యాన్ని చూపుతున్న వినియోగదారులు

నూకల బియ్యం వచ్చింది



రేషన్ దుకాణంలో కొంత మందికి మంచి బియ్యం ఇచ్చారు. కొంత మందికి నూకలు ఎక్కువగా ఉన్న బియ్యం ఇచ్చారు. బియ్యం ఇలా ఉన్నాయని అడిగితే గోదాం నుంచి ఇవే వచ్చాయని చెబుతున్నారు. అధికారులు మంచి బియ్యం ఇయ్యాలే.

– అశోక్, రేపల్లెవాడ

చర్యలు తీసుకుంటాం

రేషన్ దుకాణాలలో ఇటీవల పెద్దపల్లి నుంచి వచ్చిన బియ్యం సరిగా లేక పోవడంతో వాటిని తిరిగి పంపించాం. నూకలు, దుమ్ము ఉన్న బియ్యం సంచులు వస్తే వాటిని రిప్లేస్ చేస్తాం. వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం.

– రాజేందర్, డీఎం సివిల్ సప్లై, కామారెడ్డి

కొండపైకి చేరిన నృసింహుడు

- నింబాచల బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- కనుల పండువగా పల్లకీసేవ
- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం



పల్లకీలో ఉత్సవ మూర్తి

మోర్తాడ్: జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భీమ్‌గల్ నింబాచలం(లింబాద్రిగుట్ట) బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. కార్తీకమాసంలో 11రోజులపాటు కొనసాగనున్న బ్రహ్మోత్సవాల్లో మొదటిరోజైన గురువారం స్వామివారి పల్లకీ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రంలోని గ్రామాలయంలోని ఉత్సవ మూర్తులకు పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుష్పాలంకృతుడైన లక్ష్మీనృసింహుడు మంగళవాయిద్యాలు,భక్తుల జయజయధ్వనాల మధ్య పల్లకీలో కొండపైకి చేరారు. భక్తులు వేలాది సంఖ్యలో తరలివచ్చారు. నందిగల్లీ, నందీశ్వరాలయం, హరిజనవాడ, ముచ్కూర్ క్రాస్ రోడ్డు, పురాణీపేట్ మీదుగా కనుల పండువగా పల్లకీసేవ కొనసాగింది.



పల్లకీ సేవలో పాల్గొన్న పండితులు, భక్తులు

క్లుప్తంగా

ఉపాధ్యాయుడిగా పంచాయతీ కార్యదర్శి



నిజాంసాగర్ (జుక్కల్): జుక్కల్ మండలం మాదాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి గైని గోపాల్ గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి రా జు చేతుల మీదుగా స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయ నియామక పత్రాన్ని అందుకున్నారు. నిజాంసాగర్ మండలం మంగుళూరు గ్రామానికి చెందిన గైని గోపాల్ మొదటిసారి రైల్వేలో ఉద్యోగ సాధించారు.రెండోసారి పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగం సాధించారు.ప్రస్తుతం మూడోసారి స్కూల్ అసిస్టెంట్ గణిత ఉపాధ్యాయునిగా ఉద్యోగం సాధించారు.జుక్కల్ మండలం కండే బల్లూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరనున్నారు.

విద్యా రంగ సమస్యలపై చర్చ



కామారెడ్డి రూరల్: బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్సీఆర్టీ కార్యాలయంలో రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళిని గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కల్వదర్శి చైతన్యతో పాటు పలువురు చైర్మన్‌తో పలు విద్యారంగ సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. త్వరలో క్షేత్రస్థాయిలో ప్రాథమిక పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయ సంఘాలతో సమీక్ష నిర్వహిస్తానని చైర్మన్ హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.

లింగాపూర్ సబ్ సెంటర్ తనిఖీ



కామారెడ్డి రూరల్: లింగాపూర్ సబ్ సెంటర్‌ను పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ జోహా ముజీబ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్ సెంటర్‌లోని జాతీయ కార్యక్రమాల రిజిస్టర్లను, రికార్డులను పరిశీలించారు. సబ్ సెంటర్ ద్వారా ప్రజలకు అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. గర్భిణులు, పిల్లలకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా వైద్య సేవలు అందించాలన్నారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

10న సంతాయిపేట్‌లో సామూహిక సత్యనారాయణ వ్రతాలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): సంతాయిపేట్ శివారులోని భీమేశ్వరాలయంలో ఈ నెల 10న సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 108 సత్యనారాయణ పీటలను అందంగాంగా అలంకరించి 108 జంటలతో సత్యనారాయణ వ్రతాలు చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల జంటలు రూ.1,116లు చెల్లించి ఈ పూజా కార్యక్రమంలో కూర్చొనవచ్చన్నారు.

సన్నాలకు పెరిగిన డిమాండ్

- జై శ్రీరాంకు రూ.3వేలు
- సన్నరకాల్లో అత్యంత సన్నమైన ధాన్యం ఇదే..
- ప్రైవేటు వ్యాపారులతో ముందస్తు ఒప్పందం చేసుకుంటున్న రైతులు



మోర్తాడ్‌లో ఆరబోసిన సన్నరకం ధాన్యం

మోర్తాడ్: సన్న రకాల్లో అత్యంత సన్న రకమైన జైశ్రీరాంకు మార్కెట్‌లో డిమాండ్ బాగా ఉంది. బీపీటీ, హెచ్ఎంటీ లాంటి సన్న రకాలకు క్వింటాలుకు రూ.2,300 ఉండగా జైశ్రీరాం రకానికి రూ.3 వేలు పలుకుతోంది. ఈ రకం ధాన్యం కోతలు ఇంకా మొదలు కాలేవు. ముందస్తుగానే రైతులు, వ్యాపారుల మధ్య ధర ఒప్పందం జరుగుతోంది. జైశ్రీరాం రకం బియ్యాన్ని ఎక్కువ మంది భోజనం చేసేందుకు ఇష్టపడుతుండటంతో ఈ రకం ధాన్యానికి మొదటి నుంచి మంచి డిమాండ్ ఉంది. జిల్లాలో దాదాపు 5వేల ఎకరాల్లో జైశ్రీరాం రకం ధాన్యం సాగై ఉంటుందని అంచనా. జైశ్రీరాం రకాన్ని ప్రైవేటు విత్తన కంపెనీలు ఉత్పత్తి చేయగా ఈ రకం పంట దిగుబడి చేతికి అందడానికి సాధారణ రకాల కంటే కొంత ఎక్కువ సమయం పడుతుంది. బెంగళూర్, హైదరాబాద్‌లకు ఎక్కువగా ఎగుమతి అయ్యే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో జైశ్రీరాం రకం విక్రయిస్తే ధర ఆశించిన విధంగా లభించదు. ఒక వేళ బోనస్ వర్తించినా తమకు లాభం ఉండదనే ఉద్దేశంతో రైతులు వ్యాపారులకే విక్రయించాలని నిర్ణయించుకుంటున్నారు. గతంలోనూ వ్యాపారులకే జైశ్రీరాం రకం ధాన్యాన్ని విక్రయించిన రైతులు ఈ సారి కూడా అదే విధానాన్ని అవలంభిస్తున్నారు. కొంత మంది రైతులు ఎలాంటి రసాయనాలు వినియోగించకుండా తమ ఇంటి కోసం, కొంత ధాన్యాన్ని ఎక్కువ ధరకు విక్రయించడానికి సాగు చేయడం విశేషం. ఏది ఏమైనా జైశ్రీరాం రకానికి డిమాండ్ ప్రతి ఏటా పెరుగుతుందని చెప్పొచ్చు.

గడువులోగా సర్వే పూర్తి చేయాలి

- సర్వే, ఆన్‌లైన్‌లో నమోదు ఏకకాలంలో చేపట్టాలి
- సమీక్షాసమావేశంలో ప్రత్యేక అధికారి శరత్



నిజామాబాద్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేను నిర్ణీత గడువులోగా పూర్తిచేసేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి ఏ శరత్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బీ అతిథిగృహంలో గురువారం అధికారులు నిర్వహించిన సమావేశంలో ఇంటింటి సర్వే ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటిని ఎన్యుమరేటర్లు సందర్శించి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తిస్థాయిలో పక్కాగా కుటుంబ వివరాలు సేకరించేలా చూడాలన్నారు. సర్వే తీరును ప్రతిరోజూ పర్యవేక్షించాలని, అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. ఒక్కో ఎన్యుమరేటర్ ప్రతిరోజూ సగటున 15 ఇళ్ల వివరాలను సేకరించేలా చూడాలన్నారు. ఇంటింటి సర్వే, ఆన్‌లైన్‌లో వివరాల నమోదు ప్రక్రియను ఏకకాలంలో చేపట్టాలన్నారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ.. హౌజ్ లిస్టింగ్ ప్రక్రియ కొనసాగుతోందని, ఈ నెల 9 నుంచి సమగ్ర కుటుంబ వివరాల సేకరణ కోసం అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేశామని, ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లను అన్నివిధాలుగా సన్నద్ధం చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా నివాస గృహాల సంఖ్యకు అనుగుణంగా 3247 ఎన్యుమరేషన్ బ్లాక్‌లను ఏర్పాటు చేసి ఎన్యుమరేటర్లను నియమించడంతోపాటు పర్యవేక్షణ కోసం 356 మంది సూపర్‌వైజర్లను నియమించినట్లు తెలిపారు. నిర్దిష్ట గడువులోపు సర్వే ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో ట్రెయినీ ట్రెయినీ కలెక్టర్ సంకేత్‌కుమార్, డీఆర్డీవో సాయాగౌడ్, డీఎస్‌వో అరవింద్ రెడ్డి, సివిల్ సప్లయీస్ డీఎం రాజేశ్వర్, డీసీవో శ్రీనివాస్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నాగూరావు తదితరులు పాల్గొన్నారు.

బీరు సీసాలో కప్ప అవశేషాలు!

- డొంకేశ్వర్ వైన్స్‌లో ఘటన



డొంకేశ్వర్: బీరు సీసాలో కప్ప మాదిరి అవశేషాలు కనిపించాయి. ఈ ఘటన డొంకేశ్వర్ మండల కేంద్రంలోని వైన్ షాపులో చోటు చేసుకుంది. మండలానికి చెందిన ఓ వ్యక్తి బ్లాక్ బస్టర్ బీర్‌ను కొనుగోలు చేశాడు. అందులో నల్లగా చెత్త మాదిరిగా కనిపించడంతో బీరు సీసాను తిరిగి వైన్స్ వద్దకు తెచ్చాడు. ఆగ్రహం వ్యక్తం చేసిన సదరు వ్యక్తికి వైన్స్ నిర్వాహకులు డబ్బులు వాపస్ ఇచ్చేశారు. ఐతే, ఈ వీడియో ఆలస్యంగా బయటకు వచ్చింది. గురువారం సామాజిక మాధ్యమాల్లో జిల్లా వ్యాప్తంగా వైరల్ అయింది. దీనిపై ఎక్సైజ్ సీఐ దిలీప్‌ను వివరణ కోరగా, బీరులో ఉన్నది కప్ప అవశేషం కాదని, చెత్తలాంటి పదార్థమని తెలిపారు. దీనిపై విచారణ చేస్తున్నారని పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి



బహుమతులు అందజేస్తున్న డీఈవో అశోక్

మోపాల్: విద్యార్థులు తయారు చేసిన వేస్ట్ టు వెల్త్ ప్రాజెక్టులు అద్భుతంగా ఉన్నాయని, పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని డీఈవో అశోక్ పిలుపునిచ్చారు. గురువారం నగర శివారులోని బోర్గాం(పి) జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ, ఎన్‌జీసీ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి వేస్ట్ టు వెల్త్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. మొత్తం 42 పాఠశాలల నుంచి 84 మంది విద్యార్థులు, వారి గైడ్ టీచర్లు ప్రదర్శనలిచ్చారు. ప్రతి పాఠశాల నుంచి వేస్ట్ మెటీరియల్‌తో ఉపయోగకరమైన అనేక వస్తువులను వివిధ అంశాలతో తయారు చేసి ప్రదర్శించారు. వీటిలో మూడు ప్రాజెక్టులను ఎంపిక చేయగా, మొదటిస్థానంలో సుద్దాపల్లి జెడ్పీహెచ్ఎస్, రెండో స్థానంలో కోటగల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మూడోస్థానంలో జైతాపూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. వీరికి నగదు బహుమతి, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం డీఈవో అశోక్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు పాటుపడే క్రమంలో రియూస్, రెడ్యూస్, రీ సైకిల్ అనే నినాదాలను దృష్టిలో పెట్టుకుని వస్తువులను ఉపయోగించాలని తెలిపారు. ఏకో ఫ్రెండ్లీ ఐటమ్స్ వాడాలని, ప్లాస్టిక్ నిరోధించడం, మొక్కల పెంపకం, సంరక్షణ వంటి వాటిని బాధ్యతగా స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కె గంగాకిషన్, రాష్ట్ర ప్రాజెక్ట్ అధికారి, ఎన్‌జీసీ అధికారి విద్యాసాగర్, ఎంఈవో గేమ్‌సింగ్, పాఠశాల హెచ్ఎం శంకర్, గోవర్ధన్, సాయిబాబా, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుడు రోషన్‌లాల్ బోరా సస్పెండ్

సుభాష్‌నగర్: బీజేపీ నియమ నిబంధనలు ఉల్లంఘించి, పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యవహరించినందుకు నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలోని కంఠేశ్వర్ మండల అధ్యక్షుడు రోషన్‌లాల్ బోరాను ప్రాథమిక సభ్యత్వం నుంచి సస్పెండ్ చేసినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సస్పెన్షన్ తక్షణమే అమల్లోకి వస్తుందని ఆయన పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



ఎంపికైన బొల్లారం హైస్కూల్ విద్యార్థులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బొల్లారం హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. అండర్–14 విభాగంలో కిషన్, అండర్–17విభాగంలో నవీన అనే విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ సుకుమార్ గౌడ్ తెలిపారు. ఈ నెల 14, 15వ తేదీలలో హైదరాబాద్‌లోని దోమలగూడలో జరుగనున్న రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలలో వీరిరువురు పాల్గొంటారని ఆయన చెప్పారు. నాగిరెడ్డిపేట ఎంఈవో భాస్కర్‌రెడ్డితోపాటు ఇతర ఉపాధ్యాయులు ఇరువురుని అభినందించారు.

గురుకుల పాఠశాల నుంచి ఐదుగురు..



ఎంపికైన గురుకుల పాఠశాల విద్యార్థులు

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని బాలుర గురుకుల పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు రాష్ట స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గంగాకిశోర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ..ఈ నెల 6న కంజర్‌లో జరిగిన జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ ఖోఖో పోటీలలో కామారెడ్డి జిల్లా ప్రథమ స్థానం సాధించిందని తెలిపారు. ఈ నెల 15, 16, 17 తేదీలలో వికారాబాద్ జిల్లా తాండూరులో జరుగబోయే ఖోఖో పోటీలలో పాఠశాలకు చెందిన ఎం శ్రీకాంత్, రాజు(అండర్–14), సీహెచ్ కిరణ్, బి.రుతిక్, జి.జగదీష్(అండర్–17 విభాగంలో) ఎంపికైనట్లు తెలిపారు. పలువురు అభినందనలు తెలియజేశారు.

'కాలనీవాసులకు రోడ్డు సౌకర్యం కల్పిస్తాం'



బస్టాండ్ వెనక కాలనీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ శ్రీకాంత్ తదితరులు



చేప పిల్లలను వదులుతున్న మున్సిపల్ చైర్మన్ శ్రీకాంత్, ఆర్డీవో ప్రభాకర్ తదితరులు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి బస్టాండ్ వెనక కాలనీవాసులకు కౌన్సిలర్ మహేశ్వరి సహకారంతో రోడ్డు సౌకర్యం కల్పిస్తామని మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ అన్నారు. గురువారం బస్టాండ్ వెనక వీధిలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. కౌన్సిలర్లు నీలకంఠం, అల్లం శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, విద్యాసాగర్, తిరుపతి, పోచయ్య తదితరులున్నారు.

చేప పిల్లలను వదిలిన మున్సిపల్ చైర్మన్

ఎల్లారెడ్డి: పట్టణంలోని పెద్ద చెరువులో మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ అధికారులతో కలిసి గురువారం చేప పిల్లలను వదిలారు. జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో మండలంలోని 11 సొసైటీల పరిధిలో 6 లక్షల 63 వేల చేప పిల్లలను 45 చెరువులలో వదలినట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీపతి తెలిపారు. ఆర్డీవో ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు, ఎంపీడీవో ప్రకాష్, కౌన్సిలర్లు నీలకంఠం, అల్లం శ్రీనివాస్, సాయిలు, కాంగ్రెస్ నాయకులు నునుగొండ శ్రీనివాస్, విద్యాసాగర్, తదితరులున్నారు.

రాష్ట్ర చెస్ టోర్నీ పరిశీలకులుగా రమేశ్



నిజామాబాద్‌నాగారం: ఎస్‌జీఎఫ్ అండర్–14 బాలబాలికల రాష్ట్రస్థాయి చెస్ టోర్నీకి జిల్లాకు చెందిన వ్యాయమ ఉపాధ్యాయుడు అగుట్ల రమేశ్ పరిశీలకులుగా ఎంపికయ్యారు. ఈ నెల 8 నుంచి 10వరకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో నిర్వహించే టోర్నమెంట్‌కు పరిశీలకులుగా వెళ్లనున్నారు. రమేశ్ నవీపేట్ మండలం జెడ్పీ స్కూల్‌లో పీడీగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎంఈవో సక్కి అశోక్, ఉపాధ్యాయులు రమేశ్‌కు అభినందనలు తెలిపారు.

లారీ నుంచి 300 లీటర్ల డీజిల్ చోరీ

భిక్కనూరు: మండల సమీపంలోని జాతీయ రహదారి పక్కన నిలిచి ఉన్న లారీ నుంచి మూడు వందల లీటర్ల డీజిల్‌ను దుండగులు దొంగిలించినట్లు ఎస్సై సాయికుమార్ గురువారం పేర్కొన్నారు. బుధవారం అర్ధరాత్రి ఓ లారీ డ్రైవర్ జాతీయ రహదారి పక్కన ఉన్న ఓ దాబా హోటల్ వద్ద లారీని నిలిపి పడుకున్నాడు. వేకువ జామున లేచి చూడగా డీజిల్ ట్యాంక్ మూత తెరిచి ఉంది. అందులో ఉన్న మూడు వందల లీటర్ల డీజిల్ చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

'ఆర్టీసీ హైర్' బస్సులపై తగ్గింపు

ఖలీల్‌వాడి: వివాహాలు, దైవదర్శనాలతో పాటు తీర్థ, విహార యాత్రలకు వెళ్లే వారికి ఆర్టీసీ స్పెషల్ బస్సులపై సుమారు 20 శాతం ధరలు తగ్గించినట్లు నిజామాబాద్ రీజినల్ మేనేజర్ జానీరెడ్డి గురువారం తెలిపారు. విజ్ఞాన యాత్రలకు వెళ్లే విద్యార్థుల కోసం అదనంగా 10 శాతం రాయితీ ఉందన్నారు. రిజర్వేషన్‌కు ఆర్టీసీ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. వివరాలకు ఆర్మూర్– 7382843133,బోధన్–9849500725, నిజామాబాద్–99592 26022, బాన్సువాడ– 9491105706,కామారెడ్డి–84682 20281 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఘనంగా కార్తీక ఆకాశ దీపోత్సవం

కామారెడ్డి రూరల్: ఇల్చిపూర్ శివారులో కొలువుదీరిన సరస్వతీ మాత ఆలయంలో కార్తీక గురువారం సందర్భంగా భక్తులు ఆకాశ దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు దత్తాత్రిశర్మ, విజయపాండేల ఆధ్వర్యంలో అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. ఆలయ నిర్మాణ దాత పార్శి విఠల్ పటేల్, కోలాల సిద్దాగౌడ్, రోండ్ల నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సాయి మందిరంలో ప్రత్యేక పూజలు



కామారెడ్డి రూరల్: ఉగ్రవాయి గ్రామంలోని షిరిడీ సాయి ప్రేమ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విక్రమ్–సౌమ్య దంపతులు సాయిబాబాకు పంచదారతో తులాభారం నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాత బచ్చు విజయ్ కుమార్, భక్తులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



దోమకొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి వైద్యులు రవీందర్ బాలికలకు ఉచితంగా పరీక్షలు చేసి పలువురికి మందులను అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు లింబాద్రి, సిబ్బంది మల్లికార్జున్, ఉపాధ్యాయులు ఉన్నారు.

క్రైం కార్నర్

అనారోగ్యంతో వృద్ధురాలి ఆత్మహత్య



నాగవ్వ(ఫైల్)

గాంధారి: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధురాలు జీవితంపై విరక్తితో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన గాంధారి మండలం గండివేట్‌లో చోటు చేసుకుంది. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. గండివేట్‌కు చెందిన ద్యానబోయిన నాగవ్వ(71) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. బుధవారం మధ్యాహ్నం సీతాయిపల్లికి వెళ్లి డాక్టర్ వద్ద చూయించుకుంటానని చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు పలు చోట్ల వెతికారు. గురువారం గండివేట్ గ్రామ సమీపంలో ఉన్న పీర్ల చెరువువద్ద వృద్ధురాలి చెప్పులు ఉన్నట్లు గ్రామస్తులు గుర్తించారు. దీంతో చెరువులో గాలించగా మృతదేహం లభ్యమైంది. మృతురాలి కుమారుడు భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి గాయాలు



ఎడపల్లి: ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి గాయాలైన ఘటన ఎడపల్లి శివారులోని పెట్రోల్‌బంక్‌లో సమీపంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఎడపల్లికి చెందిన పల్లికొండ సాయిలు గ్రామ శివారులోని పెట్రోల్‌బంక్‌లో పెట్రోల్‌పోయించుకొని తిరిగి వస్తుండగా బోధన్ నుంచి నిజామాబాద్ వైపు వస్తున్న మహారాష్ట్ర ఆర్టీసీ బస్సు వేగంగా ఢీకొన్నది. ఈ ఘటనలో సాయిలుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు స్థానికులు నిజామాబాద్‌లోని ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

అనారోగ్యంతో తడిహిప్పర్గ పీఠాధిపతి మృతి



మద్నూర్: మండలంలోని తడిహిప్పర్గ దత్తాత్రి ఆలయ పీఠాధిపతి శేషారావు మహరాజ్(65) అనారోగ్యంతో మృతి చెందినట్లు గ్రామస్తులు గురువారం తెలిపారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడన్నారు. ఉదయం తడిహిప్పర్గలో నిర్వహించిన మహరాజ్ అంత్యక్రియలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ముగ్గురిపై కేసు నమోదు

మోపాల్: మండలంలోని మంచిప్ప గ్రామానికి చెందిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో యాదగిరిగౌడ్ గురువారం తెలిపారు. ఎస్‌హెచ్‌వో తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల మంచిప్పలో ధాన్యం బస్తాలు పడి రాజయ్య వాహనం అదుపు తప్పి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న రాజయ్య కుమారుడు రాజేందర్ ఆయన స్నేహితులు రాజు, వంశీ కోపంతో లారీ అద్దాలు, హెడ్‌లైట్లు పగులగొట్టి డ్రైవర్‌పై దాడి చేశారు. లారీ యజమాని ఫిర్యాదు మేరకు రాజేందర్, రాజు, వంశీపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

అర్ధరాత్రి పాన్ షాప్ తెరిచిన వ్యక్తికి జైలు

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని ఒకటో టౌన్ పీఎస్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా బుధవారం అర్ధరాత్రి వరకు పాన్ షాప్ తెరిచి ఉంచినందుకు నిర్వాహకుడు ఎండీ రిజ్వాన్‌కు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి గురువారం తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దుకాణాల నిర్వాహకులు తమకు కేటాయించిన సమయాల్లో మూసిఉంచాలని లేకుంటే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రెండు దుకాణాల్లో చోరీ




వర్ని: మండల కేంద్రంలోని కిరాణ, పెయింట్ దుకాణాల్లో గురువారం తెల్లవారుజామున దుండగులు చొరబడి నగదు, వస్తువులను ఎత్తుకెళ్లారు. ఈ రెండు దుకాణాల్లో కలిపి రూ. 30 వేల నగదు, విలువైన వస్తువులు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. పోలీసులు క్లూస్ టీం ద్వారా ఆధారాలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం

బోధన్‌రూరల్: మండలంలోని ఊట్‌పల్లికి చెందిన బానవత్ జయవర్ధన్ అనే యువకుడు అదృశ్యమైనట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు. బోధన్‌లోని మైనారిటీ హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ చదువుతున్నాడు. దసరా పండుగకు స్వగ్రామం ఊట్‌పల్లిలోని తన ఇంటికి వచ్చాడు. దసరా మరుసటి రోజు ఇంటి నుంచి వెళ్లిన అతను తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. తల్లి గిరిజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చిక్కడపల్లిలో వృద్ధురాలు..



ఎల్లవ్వ

రుద్రూర్: మండలంలోని చిక్కడపల్లికి చెందిన మచ్కురి ఎల్లవ్వ అనే వృద్ధురాలు అదృశ్యమైనట్లు ఎస్సై సాయన్న తెలిపారు. గత నెల 14న ఇంటి నుంచి వెళ్లిన ఎల్లవ్వ తిరిగి రాలేదు. కుటుంబీకులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఏజెంట్ మోసంతో బ్యాంక్ ఎదుట నిరసన



ఖలీల్‌వాడి: నగరంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న కెనరా బ్యాంకు ఎదుట జనార్దన్ అనే వ్యక్తి గురువారం అర్ధనగ్నంగా నిరసన తెలిపాడు. బాధితుడు తెలిపిన ప్రకారం.. నగరంలోని వినాయక్‌నగర్‌కు చెందిన జనార్దన్ కెనరా బ్యాంక్‌లో వ్యక్తిగత రుణాలు తీసుకున్నాడు. రుణాలకు సంబంధించిన నెలవారి చెల్లింపులు నందిపేట్‌కు చెందిన ఏజెంట్ నవీన్‌కు ప్రతి నెలా ఇచ్చేవాడు. నవీన్ బ్యాంక్‌లో వాయిదా చెల్లింపులు చేపట్టలేదు. దీంతో జనార్దన్ తన సిబిల్ స్కోర్ తగ్గడాన్ని చూసి బ్యాంకులో విచారణ చేపట్టి ఏజెంట్‌ను నిలదీశాడు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా తీసుకున్న వాయిదా డబ్బులు చెల్లిస్తానని పీఎస్‌లో ఒప్పందం జరిగింది. కానీ ఇంత వరకు తాను చెల్లించిన వాయిదా డబ్బులను ఏజెంట్ బ్యాంకులో చెల్లించక పోవడంతో నిరసన చేపట్టినట్లు బాధితుడు పేర్కొన్నాడు. ఈ విషయమై బ్యాంక్ మేనేజర్ వంశీని వివరణ కోరగా.. బ్యాంకులో క్లియరెన్స్ ఉన్నాయని, ఏజెంట్ ద్వారా జరిగిన లావాదేవీలపై విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కుళ్లినస్థితిలో మృతదేహం లభ్యం

కామారెడ్డి క్రైం: హత్య చేసి సంచిలో మృతదేహాన్ని మూటకట్టి పడేసిన ఘటన కామారెడ్డి రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే ట్రాక్ పక్కన గురువారం వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. పంచముఖి హనుమాన్ ఆలయానికి సమీపంలో రైల్వే ట్రాక్ పక్కన పడి ఉన్న ఓ ప్లాస్టిక్ సంచి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. సంచిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉంది. చనిపోయిన వ్యక్తి తెలుపు, నీలం రంగు షర్టు, నీలం రంగు జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. అతని కుడి చేతిపై ర వి నర్వాడే వైశాలి, ఆర్‌పీఐ అని పచ్చబొట్టుతో రాసి ఉంది. సదరు వ్యక్తిని ఎక్కడో హత్య చేసి ఈ ప్రాంతంలో పడేసినట్లుగా తెలుస్తోందని పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి వివరాలు ఎవరికైనా తెలిస్తే పోలీసులను సంప్రదించాలని కోరారు.

గల్లంతైన యువతి మృతదేహం..



బాసర: అప్పుల బాధ, వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక ఓ కుటుంబం బుధవారం నిర్మల్ జిల్లా బాసర గోదావరి నదిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్‌లోని న్యాల్‌కల్‌కు చెందిన వేణు మృతిచెందగా, భార్య అనురాధ ప్రాణాలతో బయటపడింది. కుమార్తె పూర్ణిమ గల్లంతైంది. గురువారం ఉదయం పోలీసులు గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం మృతదేహం లభ్యమైంది. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బాసర ఎస్సై గణేశ్ పేర్కొన్నారు.

భార్యను హింసించిన భర్తకు ఏడాది జైలు

ఖలీల్‌వాడి: రెండో వివాహం కోసం భార్యను హింసించిన భర్తకు నిజామాబాద్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వడ్డి హరికుమార్ ఏడాది జైలు శిక్షను విధిస్తూ తీర్పు వెలువరించారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ భూసారపు రాజేశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మాక్లూర్ మండలంలోని దాస్‌నగర్‌కు చెందిన ర్యాపని దేవదాస్‌కు నవీపేట్‌కు చెందిన రేఖతో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. దేవదాసుకు ఓ మహిళతో అక్రమ సంబంధం ఏర్పడి ఆ మహిళను పెళ్లి చేసుకునేందుకు ఇష్టపడి భార్య రేఖను శారీరక, మానసికంగా హింసలకు గురి చేసేవాడు. దీంతో అతనిపై కేసు నమోదైంది. విచారణలో దేవదాస్‌పై ఆరోపణలు రుజువు కావడంతో జడ్జి ఏడాది జైలు శిక్షతో పాటు రూ. ఐదువేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించకుంటే అదనంగా మూడు నెలల జైలుశిక్ష అనుభవించాలని తీర్పులో జడ్జి హరికుమార్ పేర్కొన్నారు.